నమస్తే తెలంగాణ
# నల్లగొండ
5 | నల్లగొండ, శుక్రవారం 23 ఫిబ్రవరి 2024 | NALGONDA

## ఇంటర్, టెన్త్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

● అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

నల్లగొండ, ఫిబ్రవరి 22 : ఈ నెల 28 నుంచి మార్చి 19 వరకు ఇంటర్మీడియట్ పరీక్షలను, మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, విద్యార్థులకు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి జిల్లాలో 50 పరీక్షా కేంద్రాల్లో 32,895 మంది జనరల్, ఒకేషనల్ విద్యార్థులు, 10వ తరగతికి సంబంధించి 473 పరీక్షా కేంద్రాల్లో 19,715 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. అధికారులకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద పరిశుభ్రత పాటించాలని, తాగునీటి వసతి కల్పించాలని మున్సిపల్ కమిషనర్లు, గ్రామ పంచాయతీ అధికారులకు సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో అత్యవసర మందులతో ప్రథమ చికిత్సా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్ష సమయాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు అనుకూలంగా అన్ని రూట్లలో ఆర్టీసీ బస్సులు నడుపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ రాములు నాయక్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి దస్రు నాయక్, జిల్లా విద్యాధికారి భిక్షపతి, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ యూసఫ్ షరీఫ్ పాల్గొన్నారు.

## రైతులతో వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్ యూనిట్స్‌ను తనిఖీ చేస్తున్న డీఏఓ శ్రీధర్‌రెడ్డి

పెన్‌పహాడ్, ఫిబ్రవరి 22 : రైతు వేదిక పెన్‌పహాడ్‌కు ప్రభుత్వం నుంచి వచ్చిన వీడియో కాన్ఫరెన్స్ యూనిట్స్‌ను జిల్లా వ్యవసాయ అధికారి జి.శ్రీధర్ రెడ్డి గురువారం తనిఖీ చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ యూనిట్స్ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో ఒక క్లస్టర్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా కోదాడ కాపుగల్లు, సూర్యాపేటకు పెన్‌పహాడ్, తుంగతుర్తికి వర్ధమానుకోట, హుజూర్‌నగర్‌కు పాలకవీడు, గుడుగుంట్లపాలెం క్లస్టర్‌కు ఈ వీడియో కాన్ఫరెన్స్ యూనిట్స్ మంజూరు అయినట్లు, ఈ నెల 24న ట్రయల్ రన్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇకపై రైతులకు నేరుగా ప్రభుత్వం, వ్యవసాయ శాస్త్రవేత్తల నుంచి సలహాలు, సూచనలు అందనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఏఓ బి.కృష్ణ సందీప్, ఏఈఓలు సంధ్య, మనోజ్, గోపి పాల్గొన్నారు.


# కమనీయం లక్ష్మీనరసింహుడి కల్యాణం

మార్మోగిన వేద మంత్రోచ్ఛారణలు, భక్తుల జయ జయ ధ్వానాలు

హనుమంత, గజవాహన సేవలో దర్శనమిచ్చిన స్వామివారు

### వైభవంగా పాతగుట్ట బ్రహ్మోత్సవాలు

యాదగిరి గుట్ట, ఫిబ్రవరి 22 : పూర్వగిరి లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. గురువారం రాత్రి స్వామివారి కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. మేళతాళాలు, వేద పండితులు, అర్చకులు, పారాయణికుల వేదఘోష, భక్తుల జేజేల నడుమ సంబురంగా చేపట్టారు. తుల లగ్న పుష్కరాంశ సుముహూర్తాన నారసింహ స్వామి అమ్మవారి మెడలో మాంగల్యధారణ చేసే అపూర్వ ఘట్టాన్ని అర్చకులు, వేదపండితులు వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి గజవాహనంపై ఆలయ తిరువీధుల్లో ఊరేగించారు. పండితుల వేదఘోష, భక్తజనం మధ్య గురువారం రాత్రి 8 గంటలకు మొదలైన కల్యాణ వేడుక రాత్రి వరకు కొనసాగింది. కల్యాణోత్సవానికి చూడడానికి భక్తులు వందలాదిగా తరలివచ్చారు. అంతకు ముందు ముందుగా కల్యాణ మండపంలో విశ్వక్సేన ఆరాధనతోపాటు స్వస్తి, పుణ్యాహవాచనం, సంప్రోక్షణ చేశారు. ఆలయ అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహ మూర్తి, ఈఓ రామకృష్ణారావు కంకణ ధారణ చేశారు. హనుమంత వాహన సేవ నిర్వహించారు. స్వామివారికి బంగారు యజ్ఞోప వీతధారణ చేశారు. స్వామి, అమ్మవార్లకు మధ్య తెరపత్రం ఉంచి జీలకర్ర బెల్లం ఘటాన్ని చేపట్టారు. అనంతరం ప్రత్యేక పూల మాలల దండలను మార్పిడి చేశారు. ప్రవచనలు చెప్పి, నూతన వధూవరులకు కన్యాదానం చేశారు. వేద పాఠశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ దరూరి రామానుజాచార్యులు కల్యాణ వ్యాఖ్యానం గావించారు.



మాంగల్యధారణ చేస్తున్న ఆలయ ప్రధాన అర్చకుడు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు



స్వామి వారి కల్యాణోత్సవానికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఆలయ అధికారులు

### శ్రీవారి అనుగ్రహం

తిరుకల్యాణ మహోత్సవం తిలకించిన భక్తులకు శ్రీవారి అనుగ్రహం లభిస్తుందని స్కంధ పురాణంలో స్పష్టం చేసిన విషయాన్ని కల్యాణోత్సవ వ్యాఖ్యాత దరూరి రామానుజాచార్యులు వివరించారు. సమస్త ప్రాణ కోటికి, ప్రకృతి మండలానికి లక్ష్మీనరసింహుడి అనుగ్రహం, సకల ఆయురారోగ్యాలు కలుగుతాయని వేదాలు, ఇతిహాసాలలో పేర్కొనబడి ఉందని ఆయన తెలిపారు. కల్యాణానికి ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పట్టు వస్త్రాలు తీసుకొచ్చారు. వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డితో పాటు ఆలయ అనువంశిక ధర్మకర్త డీఈఓ దోర్బల భాస్కర్ శర్మ, ఏఈఓ గజవెల్లి రమేశ్‌బాబు, ఆలయ ప్రధానార్చకులు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వేంకటాచార్యులు, యాజ్ఞికులు కిరణ్‌కుమారాచార్యులు, ఉప ప్రధానార్చకులు మాధవాచార్యులు, శ్రీధరాచార్యులు, అధ్యాపకులు నల్లన్‌థీఘళ్ సీతామనోహరాచార్యులు, పారాయణధారులు నర్సింహాచార్యులు, జగన్‌మోహనాచార్యులు, వేణగోపాలాచార్యులు, ఆలయ అధికారులు శ్రీకాంత్, విజయ్ పాల్గొన్నారు.

### అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కల్యాణ మహోత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆలరించాయి. యాదగిరిగుట్టకు చెందిన శ్రీకుసుమ హరనాథ భజన మండలి, యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి మహిళా భజన మండలి భజన కార్యక్రమం, జీవీఆర్ మ్యూజిక్ ఇనిస్టిట్యూట్ వారి భక్తి సంగీతం, శ్రీ జగిని హరీశ్ బృందం వారి నృత్య ప్రదర్శనలు అలరించాయి.



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

# 'ఉపాధి' నిధులిస్తలే..

### పల్లెల ప్రగతికి కేంద్రం అడ్డు పుల్ల

ఏడాదిగా నిలిచిన మెటీరియల్ కాంపోనెంట్ నిధులు

500 పనులు.. రూ.19 కోట్లు పెండింగ్

లబోదిబోమంటున్న పనులు చేసిన కాంట్రాక్టర్లు

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ) : జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు విడుదల చేయకుండా కేంద్ర ప్రభుత్వం పల్లెల ప్రగతిని అడ్డుకుంటున్నది. ఏడాది కాలంగా మెటీరియల్ నిధులు పెండింగ్‌లో పెట్టి నాన్చుతున్నది. సుమారు 500 పనులకు సంబంధించి రూ. 19 కోట్ల బిల్లులను నిలిపేసింది. దాంతో పనులు చేసిన కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు. మరోవైపు ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఉద్యోగులకు జీతాలు సకాలంలో అందడం లేదు.

**ఏడాదిగా నిలిచిన నిధులు**

జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామాల్లో వివిధ రకాల పనులు చేపడుతుంటారు. ఈ పథకంలో భాగంగా మెటీరియల్ కాంపోనెంట్ కింద 40శాతం నిధులు ఖర్చు చేసే అవకాశం ఉంటుంది. ఏటా గ్రామ సభలు నిర్వహిస్తూ అవసరమయ్యే పనులు, దాని ఖర్చును ముందుగానే అంచనా వేస్తారు. జిల్లా వ్యాప్తంగా 421 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఒక్కో గ్రామంలో 40 నుంచి 50 రకాల పనులు కొనసాగుతున్నాయి. ఇందులో ముఖ్యంగా సీసీ రోడ్లు, ఇంకుడు గుంతలు, వైకుంఠధామాలు, ఫిష్‌పాండ్స్, మొక్కల నాటకం, నీరు చల్లించడం, గ్రామ పంచాయతీల నిర్మాణాలు తదితర పనులు జరుతుగుతుంటాయి. వీటికి సంబంధించిన పనులు మెటీరియల్ కాంపోనెంట్ కింద గ్రామాల్లో సర్పంచ్‌లు, కాంట్రాక్టర్లు చేశారు. కానీ ఏడాది కాలంగా నిధులు విడుదల కావడం లేదు.

**రూ. 19 కోట్ల నిధులు పెండింగ్**

ఉపాధి హామీ పథకంలో భాగంగా మెటీరియల్ కాంపోనెంట్ కింద చేసిన 500 పనులకు సంబంధించి సుమారు రూ. 19 కోట్లు నిధులు రావాల్సి ఉంది. గతేడాది మార్చి వరకు మాత్రమే బిల్లులు క్లియర్ అయ్యాయి. అప్పటి నుంచి చేసిన పనులకు పైసా విడుదల చేయలేదు. ఇవే కాకుండా 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జనరేట్ కాని మరో రూ. 29 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తున్నది. మరోవైపు ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఉద్యోగులకు కూడా జీతాలు సరిగా రావడం లేదు. జిల్లాలో 417మంది పని చేస్తుండగా, డిసెంబర్, జనవరి జీతాలు రావాల్సి ఉంది. సుమారు రూ. రెండు కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి.

**ఆవేదనలో కాంట్రాక్టర్లు**

కేంద్ర ప్రభుత్వం ఉపాధి నిధులు విడుదల చేయకపోవడంతో గ్రామాల్లో పనులకు ఆటంకం కలుగుతున్నది. అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన కష్టమవుతున్నది. అంతేకాకుండా మెటీరియల్ కాంపోనెంట్ కింద పనులు చేసిన కాంట్రాక్టర్లు, మాజీ సర్పంచ్‌లు ఆందోళన చెందుతున్నారు.

## ఎకో పార్కులోని మరో జింక మృతి



తిరుమల గట్టు సమీపంలోని పొలంలో మృతి చెంది ఉన్న జింక

నందికొండ, ఫిబ్రవరి 22 : నందికొండ మున్సిపాలిటీ పరిధి నల్లగొండ, హైదరాబాద్ వై జంక్షన్ వద్ద ఉన్న ఎకో పార్కులోని మరో జింక గురువారం మృతి చెందింది. ఈ నెల 7న అదే పార్కుకు చెందిన ఒక జింక మృతి చెందిన విషయం తెలిసిందే. తిరుమలాయగట్టు సమీపంలోని పొలంలో జింక మృతి చెంది ఉండడం గమనించిన స్థానికులు స్థానిక ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఫారెస్ట్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని మృతిచెందిన జింకను అక్కడే ఖననం చేశారు. ఎకో పార్కులోని ఫారెస్ట్‌లో పర్యాటకుల కోసం ఇటీవల జింకలను వదిలారు. జింకలకు సరైన సంరక్షణ లేకపోవడంతో అవి రోడ్డుపైకి, పొలాలోని వస్తూ మృత్యువాత పడుతున్నాయని స్థానికులు అంటున్నారు. రోడ్డు పైకి, పొలాల్లోకి వస్తున్న జింకలను పలువురు వేటాడుతున్నారని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఫారెస్ట్ రేంజర్ రాఘవేంద్రను వివరణ కోరగా ఇటీవల ఫారెస్ట్‌లో వదిలిన జింకలు బయటికి రావడంతో కుక్కలు చంపి ఉంటాయని తెలిపారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేపడుతామన్నారు.

## హుజూర్‌నగర్ మున్సిపాలిటీకి నిధులు మంజూరు

హుజూర్‌నగర్ , ఫిబ్రవరి 22 : హుజూర్‌నగర్ మున్సిపాలిటీ అభివృద్ధికి డీఎంఎఫ్‌టీ నుంచి రూ.1.50 కోట్లు మంజూరు చేస్తూ గురువారం జిల్లా కలెక్టర్ వెంకట్రావ్ ఉత్తర్వులు జారీ చేశారు. హుజూర్‌నగర్ మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు విడుదల చేయించిన మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చనారవి కృతజ్ఞతలు తెలిపారు.

# జిల్లాలో మరిన్ని మీ సేవ కేంద్రాలు ?

- కొత్తవి ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల
- ఇప్పటికే నష్టాల్లో చాలా సెంటర్లు.. కొత్తవి వస్తే కష్టమేనంటున్న నిర్వాహకులు

సూర్యాపేట, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ) : సూర్యాపేట జిల్లాలో మరిన్ని మీ సేవ కేంద్రాల ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. దీనికి సంబంధించిన నోటిఫికేషన్ వెలువడంతో ప్రస్తుతం నిర్వహిస్తున్న మీ సేవ నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే జిల్లాలో దాదాపు 75 శాతం మీ సేవ కేంద్రాలు సరిగ్గా నడువడం లేదు. పనులు లేక నిర్వాహకులు నష్టాల్లో కాలం వెళ్లదీస్తున్నారు. ఇప్పుడు మరిన్ని మీ సేవ కేంద్రాలు రావడంతో వారి జీవనోపాధికి కష్టమేనని వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి.

**నష్టాల్లో 50 కేంద్రాలు**

సూర్యాపేట జిల్లాలోని 84 మీ సేవ కేంద్రాల్లో 50 కేంద్రాలు ప్రస్తుతం అంతంత మాత్రంగానే నడుస్తున్నాయి. ఆదాయం లేక నష్టాలపాలవుతున్నాయి. కొన్ని కేంద్రాలకు నెలకు రూ.10వేల ఆదాయం కూడా రావడం లేదని సమాచారం. ప్రతి మీసేవ కేంద్రంలో రెండు కంప్యూటర్లు, కలర్, బ్లాక్ అండ్ వైట్ ప్రింటర్లు, స్కానర్, ఫర్నిచర్ తదితరాల కోసం దాదాపు రెండు లక్షల రూపాయల వరకు వెచ్చించారు. ఇంత చేస్తే యజమానితోపాటు మరో ఆపరేటర్‌ను కూడా బతికించలేని పరిస్థితి. దాంతో చాలా వరకు కుటుంబంలోనే ఉన్న మరో వ్యక్తికి శిక్షణ ఇచ్చి పనులు చేసుకుంటున్నారు. రాష్ట్రంలో మీసేవ కేంద్రం ఏర్పాటు కోసం అప్పులు చేసి భరించలేక ఆత్మహత్యలు జరిగిన ఘటనలు కూడా ఉన్నాయి. ఇలాంటి నేపథ్యంలో జిల్లాలో ఇప్పటికే నడువని మీ సేవ కేంద్రాలు ఉండగా, కొత్తగా ఏర్పాటు చేయడానికి అంత అవసరం ఏంటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. నిబంధనల మేరకు కొత్త మీసేవ కేంద్రాలు ఏర్పాటు చేయాలంటే ఇప్పటికే ఉన్న మీ సేవ కేంద్రానికి 500 మీటర్ల దూరంలో ఇవ్వకూడదు. గతంలో కొత్త మీ సేవ కేంద్రాల ఏర్పాటుకు నోటిఫికేషన్ వెలువడడంతో పలువురు కోర్టుకు వెళ్లడంతో నాడు అవి ఆగినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో జిల్లాలో కొన్ని కొత్త మీ సేవ సెంటర్లకు నోటిఫికేషన్ వెలువడగా అవన్నీ దాదాపు నిబంధనలకు విరుద్ధంగానే ఉన్నట్లు తెలుస్తుంది. మరి కొత్త నోటిఫికేషన్ అమలు జరిగేనా లేక ఆగేనా అనేది మరి కొద్ది రోజుల్లో తేలనున్నది. ఇదిలా ఉంటే కొత్తవి ఇవ్వకుండా అంతంత మాత్రంగా నడుస్తున్న మీ సేవ కేంద్రాలను మార్చుకునే అవకాశం కల్పించాలని పలువురు నిర్వాహకులు కోరుతున్నారు.

### నిబంధనలకు విరుద్ధంగా మార్పు

ప్రభుత్వ కార్యాలయాల్లో జరిగే పనులు ఆన్‌లైన్ ద్వారా చేపడుతున్నప్పటి నుంచి ప్రజలకు సేవలు సత్వరమే అందేందుకు సర్కారు మీ సేవ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల ద్వారా మున్సిపల్, రెవెన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ తదితర పనులకు సంబంధించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరించే ప్రక్రియను ప్రభుత్వం నిర్ణయించే చార్జీలతో చేపడుతున్నారు. ఇలా సూర్యాపేట జిల్లాలో ప్రస్తుతం 84 మీ సేవ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా చాలా మీ సేవ కేంద్రాలను నిబంధనలు పాటించకుండా అధికారుల ప్రోద్బలంతో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మార్చుకున్నట్లు సమాచారం. దీంతో ఆయా ప్రాంతాల్లో ఉన్న మీసేవ కేంద్రాల ఆదాయం భారీగా పడిపోయిందని పలువురు నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# డీజిల్ లేక కదలని చెత్త వాహనాలు

రెండు నెలలుగా కార్యాలయంలోనే..

పారిశుధ్య కార్మికులకూ నిలిచిపోయిన జీతాలు

నందికొండ మున్సిపల్‌లో దారుణం




నందికొండ మున్సిపల్ కార్యాలయంలో నిలిపి ఉంచిన చెత్త సేకరణ వాహనాలు

నందికొండ, ఫిబ్రవరి 22 : నందికొండ మున్సిపాలిటీలోని చెత్త వాహనాలు కదలడం లేదు. డీజిల్‌కు డబ్బులు లేని కారణంగా రెండు నెలలుగా మున్సిపల్ కార్యాలయానికే పరిమితమయ్యాయి. దాంతో కాలనీల్లో చెత్త పేరుకుపోయి ప్రజలు దుర్వాసనతో కాలం వెళ్లదీస్తున్నారు. కాలనీల్లోని చెత్తను డంపింగ్ యార్డుకు తరలించడానికి వాహనాలు లేకపోవడంతో పారశుధ్య కార్మికులు కాలనీల్లోనే చెత్తను తగులబెడుతున్నారు. చెత్త వ్యర్థాల నుంచి వెద జల్లుతున్న విష వాయువులతో కాలనీల వాసులు ఇబ్బందులు పడుతున్నారు.

**గత ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు చెత్త సేకరణ**

బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు చెత్త సేకరణకు సమస్య లేకుండే. కాలనీల్లోని చెత్తను వాహనాలు ఎప్పటికప్పుడు డంపింగ్ యార్డుకు తరలించేవి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలల నుంచి నందికొండ మున్సిపాలిటీని పాలకులు పట్టించుకోవడం లేదు. మున్సిపాలిటీ నిర్వహణకు, మున్సిపల్ వాహనాలకు డీజిల్‌ను సమకూర్చడంలో స్థానిక ఎమ్మెల్యే, అధికారులు పట్టించుకోవడం లేదని మున్సిపల్ సిబ్బంది, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, సిబ్బందికి జీతాలు కూడా సకాలంలో రావడం లేదు. దాంతో వారు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా మున్సిపల్ చెత్త వాహనాల డీజిల్ కేటాయింపులకు సంబంధించి నిధులు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉన్నదని తెలిపారు. పారిశుధ్య కార్మికులు, సిబ్బంది జీతాలు కూడా చెల్లించాల్సి ఉన్నదని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు.



కేతేపల్లి మండలం కొండకిందిగూడెంలో నీళ్లు లేక ఎండుతున్న వరి పొలం

# రైతన్న కన్నీటి వ్యథ

నీళ్లు లేక ఎండుతున్న పొలాలు

మూసీ ఆయకట్టేతర ప్రాంతాల్లో పరిస్థితి దయనీయం

కేతేపల్లి, ఫిబ్రవరి 22 : కేతేపల్లి మండల పరిధిలోని మూసీ ఆయకట్టేతర గ్రామాల్లో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. గతంలో బోర్లు, బావులు, ఏఎమ్మార్పీ నీటితో రైతులు వానకాలం, యాసంగి పంటలను సాగు చేసేవారు. నిరంతర విద్యుత్ అందుబాటులో ఉండటంతో వరి, ఇతర ఆరుతడి పంటలకు ఇబ్బంది రాలేదు. ప్రస్తుతం ఏఎమ్మార్పీ కాల్వకు నీళ్లు రావడం లేదు. దాంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం యాసంగిలో వరి సాగు చేసిన మూసీ ఆయకట్టు నీరు పూర్తిగా అందని గ్రామాలైన మండలంలోని కొండకిందిగూడెం, బండపాలెం, ఇనుపాముల, కొర్లపహాడ్, గుడివాడ, ఇప్పలగూడెం గ్రామాల్లో పొలాలు ఎండుతున్నాయి. ఆయా గ్రామాల్లో సుమారు 8 వేల ఎకరాల్లో వరి వేశారు. నీళ్లలేక ఈ పొలాలు నెర్రెలు బారుతున్నాయి. కరెంటు సమస్యలు కూడా రైతులను వేధిస్తున్నాయి. ప్రస్తుతం పొలాలు చిరుపొట్ట, పొట్ట దశలో ఉన్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఆయా గ్రామాల్లో సగం పైగా పొలాలు ఎండిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల వ్యాప్తంగా మూసీ ఆయకట్టు, ఆయకట్టేతర గ్రామాల్లో ప్రస్తుత యాసంగిలో 19,500 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఆయకట్టు గ్రామాల్లో నీటికి ఇబ్బందులు లేవు.

### నీళ్లు లేక రెండెకరాల వరి పొలం వదిలేసిన



నాకున్న రెండు బోర్లను నమ్ముకొని ఈ యాసంగిలో 5 ఎకరాల్లో వరి నాటు వేసిన. ప్రస్తుతం పొలం పొట్టదశకు చేరుకుంది. భూగర్భజలాలు తగ్గడంతో బోర్లలో సరిపడా నీరు రావడం లేదు. దీనికి తోడు కరెంటు కోతలు కూడా తీవ్రంగా ఉన్నాయి. వరుస తడులు నీరు పెట్టినప్పటికీ లాభం లేదు. ఈ పరిస్థితుల్లో చేసేదేమీ లేక రెండు ఎకరాల పొలం వదిలేశాను. నోటికాడికి వచ్చిన పొలం ఎండిపోవడంతో చాలా బాధగా ఉన్నది. సరిపడా నీళ్లు, కరెంట్ ఉంటే నా పొలం ఎండిపోకుండా కాపాడుకునే వాడిని.

– అల్లి సురేశ్, రైతు, కొండకిందిగూడెం, కేతేపల్లి మండలం